# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో ఈ నెల 19 నుంచి పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- అమరావతి నిర్మాణానికి సంబంధించి అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి పి.నారాయణ చెప్పారు.

- అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులను ఈనెల 25 నుండి అందజేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

- ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కార్మిక సంక్షేమ భవనాలను నిర్మిస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలియజేశారు.

- చిత్తూరు జిల్లా కాణిపాకంలో శ్రీ వరసిద్ధి వినాయక వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుండి ప్రారంభంకానున్నాయి.

========================

రాష్ట్రంలో ఈ నెల 19 నుంచి పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పీ4 కార్యక్రమంపై ముఖ్యమంత్రి దృశ్య మాధ్యమం ద్వారా శాసనసభ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పేదరిక నిర్మూలన 2029 నాటికి సాకారం అవుతుందని తెలిపారు. ఇప్పటి వరకూ 9 లక్షల 37 వేల 913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తి అయిందని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే, లక్షా 3 వేల 938 మంది మార్గదర్శులను గుర్తించామని వివరించారు. ఈ సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, పీ4 ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కుటుంబరావు, ఆర్థిక, ప్రణాళిక శాఖ అధికారులు హాజరయ్యారు.

========================

అమరావతి రాజధాని నిర్మాణాన్ని రానున్న మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న రాజధాని నిర్మాణ పనులను ఈ రోజు మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... అమరావతి నిర్మాణానికి సంబంధించి అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. 2026 మార్చి నెలా ఖరు నాటికి అధికారులు, ఉద్యోగులకు సంబంధించి నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. కాలువలు, రిజర్వాయర్ల పనులు వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తి చేసేలా కార్యచరణతో ముందుకు సాగుతున్నామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

రాష్ట్రంలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కార్మిక సంక్షేమ భవనాలను నిర్మిస్తామని ఆ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. విజయవాడలో సంక్షేమ శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పైలట్ ప్రాజెక్ట్ గా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో ఇంటిగ్రేటేడ్ కార్మిక భవనాలను నిర్మించనున్నామని చెప్పారు. నైపుణ్యం పెంచే విధంగా కార్మికులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రతి కర్మాగారంలో ఒక భద్రతా అధికారిని  నియమించాలని ఆలోచన చేస్తున్నామని చెప్పారు. దీని వల్ల ప్రమాదాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడతాయన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్ శేషగిరి బాబు, అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు పాల్గొన్నారు.

=======================

గెజిట్ నోటిఫికేషన్ ద్వారా రాజధాని అమరావతికి అధికార రాజముద్ర లభించేలా భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు PVN మాధవ్ చెప్పారు. గుంటూరు పర్యటనలో భాగంగా శోభాయాత్ర, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఈ రోజు ఆయన పాల్గొన్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, అమరావతి ప్రాంతాన్ని అభివృద్ధి మండలిగా రూపొందిస్తామని తెలిపారు. భూసమీకరణ ద్వారా రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు ఇవ్వడం ప్రభుత్వ ప్రధమ ప్రాధాన్యతగా ఉంటుందని మాధవ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

రాష్ట్రంలో ఈ నెల 25వ తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులతో ఈ రోజు నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. దీపం పథకం ద్వారా మొదటి దశలో కోటి మందికి, రెండవ దశలో 95 లక్షల మందికి రాయితీ అందించామని చెప్పారు. మూడవ దశలో సాంకేతిక సమస్యలను అధిగమించి అర్హులందరికీ సబ్సిడీ అందిస్తామని తెలిపారు. గత సీజన్ లో రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించి 12 వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు.

విరామం

=======================

మారుతున్న కాలానికి అనుగుణంగా పోస్టల్ శాఖలో అనేక సంస్కరణలు వస్తున్నాయని శ్రీకాకుళం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు తెలిపారు. ఈ క్రమంలో రిజిస్టర్ పోస్ట్ స్థానంలో స్పీడ్ పోస్ట్ ని ప్రవేశపెట్టామని చెప్పారు. గత 50 సంవత్సరాల నుండి అందుబాటులో ఉన్న రిజిస్టర్ పోస్ట్ సేవలు సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి నిలిచిపోతున్న నేపథ్యంలో శ్రీకాకుళంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... గతంలో రిజిస్టర్ పోస్ట్ కు

మంచి గుర్తింపు ఉండేదని అన్నారు. ఆ స్థానంలో వచ్చిన స్పీడ్ పోస్ట్ ఎంతగానో ప్రజలకు ఉపయోగపడుతుందని పోస్టల్ సూపరింటెండెంట్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

చిత్తూరు జిల్లా కాణిపాకంలో శ్రీ వరసిద్ధి వినాయక వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 27 నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 3వ తేదీన రథోత్సవం, సెప్టెంబర్ 13న పుష్ప పల్లకి, సెప్టెంబర్ 16న తెప్పోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

========================

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో హోం శాఖ మంత్రి వంగలపూడి అనితతో మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ఈ రోజు సమావేశం అయ్యారు. మహిళలు, బాలికల భద్రత, విద్య, ఆరోగ్యంపై ఈ సమావేశంలో చర్చించారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల ప్రతినిధులు మంత్రిని ఈ సందర్భంగా కోరారు. రాష్ట్రంలో మహిళల రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాదాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే మహిళల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు.

========================

విశాఖపట్నం వేదికగా ఈ నెల 9న ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి 6వ జూనియర్, సబ్ - జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీలకు సంబందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ M N హరేంధిర ప్రసాద్ కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) సహకారంతో రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విశాఖపట్నంలో జరిగే ఈ పోటీలకు అన్ని జిల్లాల నుండి పారా అథ్లెట్స్ పాల్గొనాలని కోరారు.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిసాయి. ఈ ఉదయం సెన్సెక్స్ 81018 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరకు 308 పాయింట్ల నష్టంతో 80,710 వద్ద ముగిసింది. నిఫ్టీ 73.20 పాయింట్లు కోల్పోయి 24,649 వద్ద స్థిరపడింది.

========================

ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం ఉత్తర తమిళనాడు తీరం వెంబడి సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల నుంచి 7.6 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి ఎం.వెంకట రావు వెల్లడిస్తూ..

(వాయిస్ 28 సెకన్లు)

========================

========================